కథా నిలయం
శ్రీకాకుళం

# ఒక పయనం

గంగన్న ముందు నడుస్తున్నాడు. అతని నెత్తిమీద ఒక పాత ట్రంకు పెట్టె వుంది - ఆ పెట్టెలో ఏముందో, అతడు తెరచి చూపిస్తే తప్ప మనకు అర్థంగాదు! అతని వెనకాల, అతని భార్య నరసమ్మా, కొడుకు నారాయణా, కోడలు వెంకటలక్ష్మీ నడుస్తున్నారు. నరసమ్మ చేతుల్లో బట్టలు మూట వుంది! నారాయణ చేతిలో ఒక చారల బ్యాగు వుంది! వెంకటలక్ష్మి చంకలో ఆరునెలల పసికందు వుంది!

వాళ్ళు అప్పుడప్పుడే బస్సు దిగి నడుస్తున్నారు. వాళ్లు నడుస్తున్న రోడ్డు నున్నగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా పచ్చని పత్తి పొలాలు, సాయంత్రం ఎండకు మెరుస్తూ, మందంగా వీస్తున్న గాలికి రెపరెపలాడుతున్నాయి.

కంటికి ఆనినంత దగ్గరలో గుబురు చెట్లూ, వాటి మధ్య తెల్లటి మేడలూ కన్పిస్తున్నాయి. "అదే, మనం చేరాల్సిన వూరు" అంటూ మెల్లగా గొణిగాడు గంగన్న.

"ఎంత బావుందో" అంది వెంకటలక్ష్మి, చుట్టూ పొలాలను చూసి మురిసిపోతూ! ఆమె కళ్లకు ఇలాంటి పచ్చటి దృశ్యం కన్పించక ఎంత, కాలమయిందో! "నడిచినట్టే లేదు" అంది నరసమ్మ, ఆ పొలాలను కళ్లనిండా నింపుకుంటూ! వాళ్లకు మనసుల్లో తమ వూరూ, బీడుపడ్డ ఎర్రటి పొలాలు, మెదులుతున్నాయి!

"మన వూరూ ఇట్లా పచ్చగా వుంటే, ఇంత దూరం వచ్చే పని ఏముంది?" అన్నాడు నారాయణ, ముందు నడుస్తున్న తండ్రిని వుద్దేశించి మాట్లాడుతున్నట్టు-

గంగన్నకు ఒకక్షణం తమ వూరి దృశ్యాలు కళ్లముందు కదిలినాయి! ఊరి చుట్టూ భగ్గుమని మండుతున్న ఎర్రటి నేలలూ గడ్డి మొక్కకూడా కన్పించని ఆ చేన్లూ; నిస్సారమై నిర్జీవమై నీటి చుక్కకోసం నోరు తెరచినట్టుండే భూములూ, అన్నీ కళ్లముందు కదిలి, తన కొడుకు వేపు అర్థమైందన్నట్లు చూశాడు!

"కానికాలం వస్తే ఇంతే నాయనా!" అంటూ తన జేబును చేతితో తడిమి చూసుకున్నాడు. అతని జేబులో తమ వూరి వెంకటస్వామి రాసియిచ్చిన జాబు వుంది. ఆ జాబు, అందుకోవాల్సిన మనిషి ఎదురుగా కన్పిస్తున్న వూళ్లో వున్నాడు.

ఊరికి దగ్గరగా వచ్చారు వాళ్లు! ఊళ్లో మనుషుల కలకలం వినిపిస్తోంది!

ఊళ్లో అడుగుపెట్టగానే ఎదురైన ఇద్దరు, ఈ నలుగుర్నీ ఎగాదిగా చూశారు. కొత్తమనుషులు అని చూడగానే అర్థమైంది వాళ్ళకు.

"యా వూరన్నా తమది" అనడిగారు మొగాల్లోకి చూస్తూ!

"అనంతపురం దగ్గర పాపంపల్లె నాయనా! రామప్పనాయుడిని కలుసుకోవల్లని వస్తా వుండాము" అన్నాడు గంగన్న.

"ఓ... మా రామప్పనాయుడి కోసమా! అదిగో ఆ కనిపిస్తావుండే పచ్చబిల్డింగే ఆయనది. ఇంతకూ ఏం పని మీద వచ్చినారు" అనడిగాడు వాళ్ళలో ఒకరు.

"ఉన్న వూళ్లో పనుల్లేక బతుకుతెరువు కోసం వచ్చినామన్నా" సిగ్గువిడిచి చెప్పుకున్నాడు గంగన్న!

"ఔను పాపం! మీ అనంతపురం జిల్లా నుండి చాలామంది ఈవైపు వస్తావుండారు. ఈ సంవత్సరం పెద్దకరువు వచ్చి పడిందంటనే" అన్నాడు జాలిని కనబరుస్తూ ఆయన!

'కరువు' అనే మాట వినగానే వాళ్ల శరీరాలు భయంతో జలదరించినాయి! ఏళ్లతరబడి కరువులో బతుకుతున్నప్పటికీ, ఆ 'కరువు' అనేమాట వినటానికే వాళ్లు ఇష్టంగా లేరు! కరువు తెచ్చి పెట్టిన విషాదం వాళ్ల జీవితాల్ని ఆవరించి వుంది. తమను యింతదూరం నడిపించిన ఆ కరువు అనే మాటే, వాళ్లకు క్రూరమైన శత్రువులా కన్పిస్తోంది! తాగటానికి నీళ్లులేని కరువు! తినటానికి తిండిలేని కరువు! పొలాలపై నీళ్లు ప్రవహించని కరువు! పశువులకు గడ్డిపోచ దక్కనివ్వని కరువు! పశువుల కళేబరాలకోసం ఆకాశంలో గిరికీలు కొడుతున్న రాబందుల రెక్కల చప్పుడు లాంటి కరువు! ఒక్కసారిగా తల విదిలించుకున్నాడు గంగన్న!

"యాల చెప్పుకోవల్లలే నాయనా? కడుపు చించుకుంటే కరువు కాళ్లమీద పడుతుంది! మీ రామప్పనాయుడు ఏదన్నా పని చూపిస్తే బతికిపోతాము" అన్నాడు గంగన్న!

"మీకేం బయం లేదు! పని చేసే పురసత్తు వుండల్లగాని ఏదో ఒక ఆదరువు చూపిస్తాడు మా నాయుడు! పొయిరండి... నాయుడు ఇంటికాడే వుండాడు" అని చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు.

"అమ్మయ్య" అంటూ వూపిరి పీల్చుకుంది గంగన్న కుటుంబం! "ఇంతదూరం నమ్మకొని వస్తావుండామే, ఇక్కడి పరిస్థితులెట్లా వుండాయో ఏమో?" అన్న అనుమానం

వాళ్ళను ఒకవైపు పీడిస్తూనే వుంది. వీళ్ళు పలికిన నాలుగు మాటలతో ఒక భయం తొలగిపోయినట్టయింది వాళ్ళకు!

ఒక పచ్చబిల్డింగ్ దగ్గరకు చేరుకున్నారు వాళ్లు! పెద్ద బిల్డింగు! పైన అంతస్తు కూడా వుంది! బిల్డింగు చుట్టూ కాంపౌండు! కాంపౌండుకు ఇనుపగేటు! గేటు తెరచే వుంది! నేరుగా లోపలికి అడుగు పెట్టినారు వాళ్ళు! లోపల విశాలమైన ఆవరణ! పెద్ద పెద్ద గడ్డివాములు! ఒక వైపున రెండు ట్రాక్టర్లు, ఒక జీపూ వున్నాయి. వాతావరణమంతా గమనించేసరికి, రావాల్సిన చోటుకే వచ్చామనుకున్నారు వాళ్ళు!

"ఎవురూ? ఎవురు మీరూ?" అంటూ ఒక నడివయసు మనిషి గద్దిస్తూ ఎదురుగా వచ్చాడు.

"రామప్పనాయుడి కోసం వచ్చినాము" అంటూ వినయంగా చెప్పుకున్నాడు గంగన్న!

"యావూరు? ఏమిటి? ఎందుకు? కొత్తమొగాల్లా వున్నారే? ఈ ప్రాంతం వాళ్ళు కాదే?" ఇలాంటి ప్రశ్నలన్నీ రకరకాలుగా వేసి జవాబులు రాబట్టి, నమ్మకం కుదిరి, తన వెంట లోపలకు పిల్చుకుపోయాడు ఆ నడివయసు మనిషి!

లోపల హాల్లో జగితి మీద నింపాదిగా కూచున్న అరవైఏళ్ళ మనిషిని చూపిస్తూ "ఆయనే...వెళ్ళి కలుసుకోండి" అని చెబితే ఆశ్చర్యపోయారు వీళ్ళు! రామప్పనాయుడంటే, చాలా లావుగా, ఎత్తుగా, సినిమాల్లో భూస్వామిలా హుందాగా వుంటాడని భావించిన వీళ్లకు అందుకు విరుద్ధంగా కన్పించేసరికి విస్తుపోయారు.

రామప్పనాయుడు పొట్టిగా, కుదమట్టసంగా, ముతక బనియను, ముతక పంచతో, ఎర్రటి ఎరుపురంగు శరీరంతో, చూడగానే మనలాంటి మనిషే అనిపించేలా వున్నాడు.

గంగన్న ఆయన దగ్గరకు వెళ్ళి, తన చొక్కా జేబులోంచి కాగితం మడతతీసి, ఆయనకు వినయంగా అందించాడు. దాన్ని అందుకుంటూ 'కూడోండి' అన్నాడాయన. వాళ్ళు ఆయన ఎదురుగా వున్న చిన్న అరుగుమీద కూర్చున్నారు.

కాగితంలో రాసిన విషయమంతా చదివి, వెంకటస్వామి ఆరోగ్యం గురించి, కుటుంబం గురించి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నాడు.

"నాగన్నా" అంటూ కేకవేస్తే, వచ్చిన మనిషికి, వీళ్ళ గురించి చెప్పి, "మన పెంకుల కొట్టంలో వీళ్ళకు బస ఏర్పాటు చేయించు" అని పురమాయించి, "మీరు వెళ్ళండి! పొద్దున మాట్లాడుకుందాం" అని పంపించాడు.

గంగన్న కుటుంబమంతా పెంకుల పాకలోకి చేరుకుంది. విశాలంగా, రెండు గదులతో అనుకులంగా వుంది ఆ పాక! అప్పటికే చీకటి పడుతూ వుంది! పాకలో కరెంటు బల్బు వెలిగించారు.

నరసమ్మా, వెంకటలక్ష్మీ ఇల్లు శుభ్రం చేసే పనిలో మునిగిపోయారు - తాము తెచ్చిన బట్టలనూ, ఇతర సామాన్లనూ ఒక మూల సర్దుతున్నాడు నారాయణ.

గదిలో ఒకమూల వున్న పాతబెంచీ మీద కూచున్నాడు గంగన్న. ఎక్కడ తమ వూరు? ఎక్కడ ఈ వూరు? ఇలా రాగలం అని ఎప్పుడైనా వూహించినామా? ఒక్కసారిగా తమ వూరు, ఇల్లూ, ఇంటి దగ్గర విడిచిపెట్టి వచ్చిన ముసలి తల్లీ, చిన్న కొడుకూ గుర్తుకు వచ్చినారు. అతని ఆలోచనల్లో జీవితమంతా ఒకసారి మెదిలింది!

ఐదారు సంవత్సరాల కిందటి వరకూ కూడా గంగన్న కుటుంబం ఆ వూళ్లో, ఒక స్థాయిగల మంచి రైతు కుటుంబం కిందే లెక్క! పదెకరాల మెట్టా, బావి కింద రెండెకరాల సాగుభూమీ, స్వంత ఇల్లూ, ఇంటి వెనుక దొడ్డిలో గడ్డి వాములూ, పాడిచ్చే పశువులూ, భార్య మెడలో ఐదారు తులాల బంగారమూ, పచ్చగానే బతుకుతున్న కుటుంబం అతడిది! అప్పుడప్పుడూ వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పటికీ, ఏదో ఒక ఏడు మంచి పంటలు పండి, కుటుంబం నిలదొక్కుకొనేది! అయితే గత నాలుగైదు ఏళ్లుగా పరిస్థితులు మారి పోయినాయి! వరుసగా రెండేళ్లు వర్షం రాకపోవటంతో బావిలో నీళ్లు అడుగంటిపోగా, అప్పుచేసి రెండు బోర్లు వేయించాడు. ఆ బోర్లు సంవత్సరం దాటకుండానే ఫెయిల్ అయ్యాయి. వేసిన పంట చేతికి రాదనే భయంతో పొలంలో సర్ఫేస్ బోర్ వేయించి, సబ్‌మెర్సిబుల్ మోటర్ ఫిటప్ చేయించినా, ఆ వచ్చే నీళ్ళు వూరించి పూరించి ఆరునెలలకల్లా అప్పులను మాత్రమే మిగిల్చాయి. వర్షాలొచ్చి చెరువులోకి నీళ్ళు వస్తే ఈ పరిస్థితి వుండేది కాదు.. కొరకోళ్ల డ్యామ్ (పి.ఎ.బి.ఆర్) నుండీ ప్రతీ సంవత్సరమూ చెరువులకు నీళ్ళు యిస్తామని పదేళ్ళుగా రాజకీయ నాయకులు మాటలు చెప్పటమే గాని, ఇంతవరకూ ఆ డ్యామ్‌కు నీళ్ళు సాధించే ప్రయత్నం ఎవ్వరూ చేసిన పాపాన పోలేదు. ఆ డ్యామ్ నింపి నీళ్ళు ఇస్తే చుట్టూ నలభై చెరువులు నింపవచ్చు- ఈ జిల్లాకు జరిగిన నీటి ద్రోహం గురించి గంగన్న కూడా ఏళ్ళ తరబడి వింటూనే వున్నాడు.. తన కొడుకు నారాయణ పార్టీల పిలుపుతో పాదయాత్రలు కూడా చేసినాడు- తుంగభద్రా, శ్రీశైలమూ రెండూ నిండినా మన కొరకోళ్ల డ్యామ్‌కు మాత్రం ఈ ప్రభుత్వం నీళ్ళు ఇవ్వదని ఎన్నెన్నో విషయాలు నారాయణ అప్పుడప్పుడు చెప్పినా, తనకు అర్థమయింది, తమ చెరువుకు నీళ్ళు ఇవ్వరనే విషయం మాత్రమే, నీళ్ళే ఇస్తే తమ బావులూ, బోర్లూ ఇలా వుండేవీ కావు! ఈ అప్పులిలా అఘోరించేవీ కావు అని మధన పడేవాడు గంగన్న. బోర్లకు చేసిన అప్పులూ వేరుశనగ పంటకు పెట్టిన పెట్టుబడుల అప్పులూ, ఈ ఐదేళ్ళలో పెరిగి పెరిగి అప్పు లక్షన్నర దాటిందనుకుంటేనే భయంతో శరీరం కంపించిపోయేది గంగన్నకు! భార్య మెడలో వున్న బంగారం అమ్మి ఇరవైవేల అప్పు తీర్చినా మిగిలిన అప్పు నెత్తిమీద కత్తిలా వేలాడుతూనే వుంది. తన లాగా వ్యవసాయంలో అప్పుల పాలైన ఎందరో రైతుల జాబితాలో గంగన్న కూడా చేరినాడు.

ఇప్పుడు గ్రామంలో రైతుల అప్పుకు రహస్యం లేదు. ఒకప్పుడు ఫలానా రైతుకు ఇంత అప్పుంది అని రహస్యంగా గొణుక్కొనేవారు! ఇప్పుడలా కాదు! అప్పు అనేది రైతు వ్యవసాయ విధానంలో ఒక ప్రధాన భాగమయిపోయింది. అప్పులున్నందుకు గంగన్న సిగ్గుపడలేదుగాని, అది తీర్చే మార్గమే ప్రశ్నార్థకమైపోయింది. అతనికి వున్న మెట్టపొలం పది ఎకరాలూ, ఊరికి సమీపంలో వుంది. సకాలంలో వర్షాలు వచ్చి సరైన పంట పండితే ఈ అప్పులుండేవి కావుకాని నాలుగేళ్లుగా వేరుశనగ పంట ఏ రైతుకూ చేతికి చిక్కలేదు. అదునుకు వర్షాలు రాక పంట ఆలస్యంగా వేయటంతో ఒక సంవత్సరం పెట్టుబడులు కూడా గిట్టలేదు. ఒక సంవత్సరం విత్తనమే నేలలో పడలేదు. మరో సంవత్సరం పురుగుపట్టి పైరంతా నల్లగా మాడిపోయి విత్తనం కూడా వెనక్కు తిరగలేదు. ఇంకో సంవత్సరం, నెలరోజులపాటు విడవకుండా భారీవర్షాలు పడి పంటంతా కుళ్ళిపోయి, చేన్లోనే పారేయాల్సి వచ్చింది. ఇలా నాలుగేళ్లు పంట అందకపోయేసరికి రైతులంతా భూమి అంటేనే భయం భయంగా చూసే పరిస్థితి దాపురించింది. దీనికి తోడు ఈ ఆరేళ్లలో పెట్టుబడులు రెట్టింపుకావటం, కాయధరలో మాత్రం ఏ మార్పు లేకపోవటం.

ఈ సంవత్సరమైతే మరీ ఘోరం, గత యాభైఏళ్ళలో ఇంత కరువు ఎప్పుడూ రాలేదని, పాతతరం వాళ్ళు నోళ్ళు నొక్కుకొని చెబుతున్నారు. గత సంవత్సరం పంట నష్టపరిహారం కింద యిచ్చిన 2500 రూపాయల చెక్కుకోసం మండల ఆఫీసు చుట్టూ బిచ్చగాడిలా తిరిగి తిరిగి తెచ్చుకున్న గంగన్నకు తన బతుకు మీద తనకే అసహ్యం వేసింది! తన కుటుంబమే కాదు ఊర్లకు ఊర్లన్నీ కరువువాత పడిపోయినాయి! దాని ఫలితంగానే ఈ సంవత్సరం, ఎప్పుడూలేని విధంగా, రైతుల ఆత్మహత్యలు మరీ దారుణమై జిల్లాలో వ్యవసాయమే సంక్షోభంలో కూరుకుపోయింది. చేద్దామంటే పనిలేదు! పనికి ఆహారపథకం కింద తనలాంటి వాడు కూలికి వెళ్ళలేని పరిస్థితి! ఆ పథకం కూడా పట్టుకుని పది రోజులు కూడా కూలీలకు పనులు కల్పించలేక పోయింది! ఉన్న భూమిలో నాలుగెకరాలైనా అమ్మి అప్పులు తీరుద్దామంటే కొనేనాథుడే లేడు. న్యాయంగా అయితే గంగన్నకున్న పదెకరాల మెట్టా ఆరేళ్లక్రితం నాలుగు లక్షల విలువ చేసేది- ఇప్పుడు ఎకరా పదివేలంటే కూడా ఎవ్వరూ ముందుకు రావడం లేదు.

రోజు రోజుకూ తిండిగింజలను ఏపూట కాపూట సమకూర్చుకోవటమే దుర్భరమైపోయింది గంగన్నకు! ఇంట్లో తినేవాళ్ళు ఆరుగురున్నారు, ఒక్కరికి కూడా చేయటానికి పనిలేదు, గడ్డిలేక రెండు గిత్తల్ని, ఎనుగొడ్డునూ అయిన వాడికి అమ్మి కొద్దిరోజులు బతుకు ఈడ్చినాడు. ఈలోగా వూళ్ళో ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకోవటంతో మరీ పిరికివాడైపోయాడు గంగన్న! ఇప్పుడున్న ఒకే మార్గం వూరు విడవటం! ఎక్కడికైనా వలసవెళ్ళి, కూలీనాలీ చేసుకొని పెళ్ళాం పిల్లల్ని పోషించుకోవటం!

తమ పక్కింటిలో ఉన్న వెంకటస్వామితో ఆలోచించినాడు గంగన్న. వెంకటస్వామి ఆ వూళ్ళోనే పెద్దరైతు; అతనికి పంటలు పండకపోయినా వచ్చే బాధలుండవు; అతని ఇద్దరి కొడుకులూ పెద్ద ఉద్యోగాల్లో వున్నారు. పట్టణంలో వ్యాపారాలూ, భవంతులూ, వున్నాయి. గంగన్న వెంకటస్వామి దగ్గర చేసిన అప్పే పాతికవేలకు పైగా వుంది. గంగన్న అతడిని కలిసి నువ్వే ఏదో ఒక దారి చూపి మా కుటుంబాన్ని గట్టున పడెయ్యాలి అని సిగ్గు విడిచి అడుక్కున్నాడు. గంగన్న పరిస్థితి అతనికి తెలుసు. పూర్తిగా భూమిని నమ్ముకొని రెక్కల కష్టంతో బతికే గంగన్న పట్ల అతనికి గౌరవమే వుంది. బాగా ఆలోచించి "నువ్వు ఏమీ అనుకోనంటే ఒక మార్గం చూపుతాను" అన్నాడు. ఏదైనా సరే చెప్పమన్నాడు గంగన్న "మా బంధువు ఒకాయన కర్నాటకలో బళ్ళారి దగ్గర కంపిలి కొట్టాలలో వున్నాడు. పెద్దరైతు. అతనికి కాల్వల కింద వరి పండే ముప్పయి ఎకరాల మాగాణి వుంది. పత్తి పొలాలూ వున్నాయి. సంవత్సరమంతా పని వుంటుంది. మీరు నలుగురూ కష్టపడితే రోజుకు నాలుగు వందలకు పైగా సంపాదించుకోవచ్చు" అని సలహా ఇచ్చినాడు. గంగన్న మనసులో వున్నది కూడా ఇలాంటి మార్గమే. అంతే ఒక్కరోజు కూడా అగలేదు గంగన్న! వెంకటస్వామితోనే దారి ఖర్చులకు యిప్పించుకొని, మరుసటిరోజు పొద్దున్నే, ఎవరికీ చెప్పకుండా, మూటా ముల్లె సర్దుకొని కుటుంబంతో బయలుదేరినాడు.

అంతా గుర్తుకు వచ్చి కుమిలి కుమిలి దుఃఖించినాడు గంగన్న. కనుకొలకుల నుండీ చుక్కలు చుక్కలుగా కారిన కన్నీళ్ళు అతని గడ్డాన్ని తడిపివేసినాయి. సరిగ్గా పదేళ్ళక్రితం ఒకనాడు ఒక నడివయసు మనిషి తన ఇంటికి వచ్చి "బొత్తిగా పనుల్లేక, జరుగుబాటు లేక మా జిల్లా వదలి ఇంత దూరం వచ్చినాను. మీరు ఉత్తములనీ దయగల మనిషనీ, వూళ్ళో వాళ్ళు చెబితే మీ ఇంటికి వచ్చినాను. మీ తోటలో గుడిసెలో వుంటాను. మీ తోటకు కాపలా వుండి, చెప్పినపని చేస్తాను. నాకు రెండు పూటలా తిండి పెట్టి మీకు తోచినది యివ్వండి" అని వేడుకున్నాడు. తాను కరిగిపోయి తన తోటలో వుండటానికి చోటు కల్పించినాడు. చాతనైనపని అప్పజెప్పి, తిండి పెట్టి బట్టాబాతా సమకూర్చినాడు. సంవత్సరంపాటు తన తోటలో వున్నాడతను. అతనిది మహబూబ్‌నగర్ జిల్లానట! సంవత్సరం తర్వాత తమ వూరికి బయలుదేరితే రెండువేలు యిచ్చి పంపించినాడు. అలాంటి తను ఈ రోజు కుటుంబంతో సహా వూరు విడిచి, మరొకరి పంచన చేరాల్సి వచ్చింది... జ్ఞాపకాలు తరమగా గంగన్న గుండె భారమైపోయింది. పక్కన కూచున్న నరసమ్మ అతడిని గమనిస్తూ వుంది. అతని ఆలోచన లేమిటో ఆమెకు అర్థమైంది.

"మనకు మాత్రమేనా ఈ గతి పట్టింది ఎట్లా ఎట్లాంటి రైతులు కూడా పనీపాటా కోసం వూరు విడిచి పరాయి చోటికి వెళ్ళిపోతా వుండారు. కాలమెప్పుడూ ఇట్లాగే వుంటుందా? రెండేళ్ళు మంచి శనక్కాయపంట పండల్లేగాని మన అప్పులు తీరేది

ఎంత సేపు? మళ్ళీ వానలు రాకపోతాయా? మన వూరి చెరువుకు నీళ్ళు ఇవ్వక పోతారా? నువ్విట్లా యదారు పెట్టుకోవద్దు! పాండవుల్లాంటి వాళ్ళు వదమూడేళ్లు వనవాసం చేసినారంట! మనమనగా ఎంత? ఊరుకో..." అంటూ గంగన్నను ఓదార్చింది నరసమ్మ.

మరుసటి రోజు పొద్దున్నే రామప్పనాయుడు పిల్వపంపితే; నలుగురూ దగ్గరగా వెళ్ళి నిలబడినారు-

"చూడు గంగన్నా! నువ్వు మరీ సిగ్గుపడుతూ నా ముందు నిలబడొద్దు! నా మాదిరీ నువ్వూ రైతువే, నీ సంగతంతా మా వెంకటస్వామి వివరంగా రాసినాడు. మీ అనంతపురం జిల్లా కరువు పరిస్థితులు ఇక్కడ అందరికీ తెలుసు. మీ జిల్లానుండి వలసలు వచ్చిన వాళ్ళు ఈ చుట్టుపక్కల దండిగా వున్నారు. నువ్వేమీ సంకోచపడవద్దు- మా వరిమళ్ళలోనూ, పత్తి చేన్లలోనూ, చేసేన్ని పనులు ఎప్పుడూ వుంటాయి-మీరంతా మీ సొంత యింటిలోలా ఇక్కడ వుండిపోండి - మీకు కావాల్సిన సంబరాలన్నీ అడిగి తీసుకోండి. ఇక్కడ కూడ మీరు రైతుల్లాగే బతకండి! మనందరిదీ రైతు వంశం! మనల్ని మనమే కాపాడుకోవల్ల; మీరిక్కడున్నంత కాలమూ ఇక్కడి రేటుకంటే ఎక్కువగానే మీకు ఫలితం ఇస్తాను. మీ ప్రాంతంలో పరిస్థితులు చక్కబడగానే మీరు వెళ్ళవచ్చు..." అని చెప్పినాడు రామప్పనాయుడు.

"మా ప్రాంతంలో ఏ పరిస్థితులూ చక్కబడవు నాయనా! నలభై ఏండ్ల నుండీ సేద్యం చేస్తున్నాను. రాను రాను కాలం మరీ ఘోరమైపోయింది. సేద్యం అంటేనే విరక్తి పుడుతోంది. మా జిల్లా రైతుల చేతుల్లో ఇప్పుడు ఉత్తభూమి మాత్రమే వుంది. విత్తనాలు మా చేతుల్లో లేవు. ఎరువులు మా చేతుల్లో లేవు. మందులు మా చేతుల్లో లేవు. నీళ్లు మా చేతుల్లో లేవూ. కరెంటు మా చేతుల్లో లేదు. ధర మా చేతుల్లో లేదు. ఈ అన్నిటినీ ఎవరో కట్టగట్టి మా చేతుల్లోంచి లాక్కుపొయ్యినారు. అవన్నీ మళ్ళీ మా చేతుల్లోకి వస్తే తప్ప మేము బతికి బట్టగట్టలేము..." అన్నాడు గంగన్న నిర్వేదంతో.

- రామప్పనాయుడు దీర్ఘమైన ఆలోచనలో పడిపోయినాడు. గంగన్న మాటల్లో ఏదో నిగూఢమైన సత్యం లాంటిది వుందనిపించింది.

"మరీ అంత నిరాశ వద్దు గంగన్న! ఈ రోజు కాకపోయినా రేపైనా మన రైతు తన చేతుల్లోకి అన్నీ తెచ్చుకుంటాడు." అని ధైర్యం పలికాడు.

తెలతెలవారుతుండగా గంగన్నా, నరసమ్మా నారాయణా, వెంకటలక్ష్మి పచ్చని వరిమళ్ళ గెనాల మీదుగా నడుస్తున్నారు... ఇక్కడి లాగా కనీసం ఒక ఎకరా భూమికైనా తమకు సాగునీరు వుంటే అన్న ఆకాంక్ష వాళ్ళ మనసుల్లో సుడులు తిరుగుతోంది- వాళ్ళ చూపులు మాత్రం అనంత దూరంలో వున్న, తమ గ్రామపు ఎర్రటి పొలాలపై

కరాళనృత్యం చేస్తున్న కరువు రాక్షసి పాదాలను, సూదుల్లా గుచ్చుతున్నాయి. ఆ ఎర్రటి పొలాలపై నీళ్ళెప్పుడు జాలువారుతాయా? ఇక్కడిలాగా అక్కడ కూడా పచ్చదనం ఎప్పుడు పరిమళిస్తుందా అన్న ఆశాంకురాలు వేగంగా మొలకలెత్తుతున్నాయి. కరువులో నడిచిన వాళ్ళ పాదాలు, మెత్తని పచ్చికమీద ఒత్తిగిలినట్టు మృదువుగా సాగుతున్నాయి. మళ్ళీ తమ వూరివేపు తమ పాదాలు పయనించాలని, వాళ్ళ మనసుల్లో అనంతమైన ఆశల సవ్వడులు ధ్వనిస్తూనే వున్నాయి.

● *ప్రజా సాహితి - నవంబర్, 2005* ●